సాక్షి నిర్మల్

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



'కేజీబీవీ'లో ఎంసెట్ కోచింగ్

కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఎంసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జూమ్ యాప్ ద్వారా ఉదయం, సాయంత్రం తరగతులు బోధిస్తున్నారు. 8లో▸



గోదారంగనాథుల కల్యాణం

మామడ మండలం పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదారంగనాథుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
38.4/24.4

వాతావరణం

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

'పది' విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలి



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పదో తరగతి విద్యార్థులకు పరీక్ష హాల్‌లో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని బాగులవాడ, సోమవార్‌పేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ గదిని పరిశీలిస్తూ విద్యార్థుల హాజరు నమోదు, తాగునీరు, టాయిలెట్స్ తదితర సౌకర్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సుభాష్‌చందర్ ఉన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు



వద్యాల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం పరిశీలించిన డీఈవో రవీందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వద్యాల్, లక్ష్మణచాంద పరీక్ష కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. వద్యాల్ పరీక్ష కేంద్రంలో 129, లక్ష్మణచాంద కేంద్రంలో 182 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఆయన వెంట సీఎస్‌లు చంద్రనాగకాంత్, రాంచందర్, డీవోలు విజయభాస్కర్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలి



ఆయిల్‌పాంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుంటాల: ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి సారించాలని ప్రాంతీయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పెంచికల్‌పాడ్‌లో ఆయిల్‌పాం సాగును పరిశీలించారు. వేసవి దృష్ట్యా నీటి తడులు అందించాలని సూచించారు. మొక్క చుట్టూ నీరు నిలిచేలా గుంతలు తవ్వి కలుపు తీయాలని తెలిపారు. ఆయన వెంట ఉపసర్పంచ్ కిష్టయ్య, క్లస్టర్ అధికారి విశ్వతేజ, రైతులు ఉన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండా గ్రామానికి చెందిన రాఘవేంద్ర, రుక్మాబాయి, నగేష్, శంకర్, దేవుబాయి, లతాబాయి, బాబు, గంగవ్వ, శంకర్ అనే రైతులు వరి పంటకు తెగుళ్లు సోకాయని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మార్చి 23న ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు నవీన్‌కుమార్, ప్రమీల, ముధోల్ ఏరువాక వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తలు నర్సయ్య, సాయిచరణ్ మంగళవారం పంటలను పరిశీలించారు. సోన 1126 దొడ్డు రకం వరి విత్తనాలను మండల కేంద్రంలోని ఓ షాపులో కొనుగోలు చేసి యాసంగిలో సాగు చేశారు. సాగు చేసిన వరి పంటకు తెగుళ్లు సోకాయి. ఎన్ని మందులను పిచికారీ చేసినా తెగుళ్లు అదుపులోకి రాలేదని రైతులు తెలిపారు. నివేదిక ఉన్నతాధికారులకు తెలియజేస్తామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వారివెంట మండల వ్యవసాయాధికారి గణేశ్ ఉన్నారు.

అమాత్యుడిపై అసమ్మతి!

- ఏడాదిగా సైలెంట్‌గా సత్యనారాయణగౌడ్
- మంత్రిపైనే మాటలదాడి చేసిన 'కూచాడి'
- ఇప్పటికీ కౌంటర్ ఇవ్వని మంత్రి వర్గం
- వారిద్దరూ పార్టీకి దూరమేనా..?
- తాజా సమ్మేళనానికి 'పత్తిరెడ్డి' డుమ్మా
- 'కారు'కు కలిసిరాని 'ఆత్మీయులు'



2018ఎన్నికల ప్రచారంలో ఇంద్రకరణ్‌రెడ్డివెంట శ్రీహరిరావు, సత్యనారాయణగౌడ్

నిర్మల్: రాజకీయాలు ఎప్పుడు ఎలా మారుతాయో ఊహించడం కష్టం. శత్రువులు మిత్రులు కావడం, మిత్రులు శత్రువులు కావడం పరిపాటే. ఎవరికెవరు శత్రువు.. ఎవరికెవరు మిత్రులు.. అని చెప్పడం అసాధ్యం. నిర్మల్‌లో ఇది మరింత కష్టం. అధికార పార్టీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. సాఫీగా సాగిపోతున్న 'కారు' ప్రయాణానికి కుదుపులు ఎదురవుతున్నాయి. ఎన్నికల వేళ అందరినీ కలుపుకుపోయేందుకు నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు నిర్మల్ నియోజకవర్గానికి కలిసిరావడం లేదు. నియోజకవర్గంలో మంత్రి తర్వాత సీనియర్లుగా ఉన్న కూచాడి శ్రీహరిరావు, వల్లకొండ సత్యనారాయణగౌడ్ ప్రస్తుతం పార్టీకి దూరంగా ఉన్నారు. ఆత్మీయ సమ్మేళనాలకు హాజరు కావడం అటుంచి, వాటిపైనే 'కూచాడి' విరుచుకుపడటం, ఏడాదిగా సత్యనారాయణగౌడ్ సైలెంట్‌గా ఉండటం పార్టీని కలవరపెడుతోంది. సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమ్మేళనానికి అక్కడి జెడ్పీటీసీ, సీనియర్‌నేత పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గైర్హాజరు కావడం తాజా చర్చనీయాంశమైంది. వ్యక్తిగత కారణాలతో రాలేదని చెబుతున్నా.. ముందే ఖరారైన కార్యక్రమానికి ఆయన ఎందుకు దూరంగా ఉన్నారన్న చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలు 'కారు'ను కంగారు పెడుతున్నాయి.

'కారు' దిగుతారా?

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజలకు చేరువవుతున్న సమయాన గులాబీదళానికి సొంత నేతలే షాక్ ఇస్తున్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తర్వాత నిర్మల్ నియోజకవర్గంలో పార్టీకి పెద్దదిక్కుగా, సీనియర్లుగా కూచాడి శ్రీహరిరావు, వల్లకొండ సత్యనారాయణగౌడ్ ఉన్నారు. ప్రస్తుతం వీరిద్దరూ మంత్రితోపాటు పార్టీకి దూరంగా ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ వారు కలిసిపోతారన్న ఆశలు కనిపించడం లేదని పార్టీవర్గాలే చెబుతున్నాయి. సత్యనారాయణగౌడ్ 'కారు' దిగే యోచనలో ఉన్నట్లు ఆయన వర్గం చెబుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో శ్రీహరిరావు కూడా అదేబాటలో వెళ్లొచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఆయన మంత్రిపై మాటల దాడిచేసి మూడు రోజులవుతున్నా మంత్రి కానీ ఆయన అనుచరవర్గం నుంచి కానీ ఎలాంటి కౌంటర్ రాకపోవడం చర్చనీయాంశమైంది.

సత్తన్న సైలెంట్...

సీనియర్ నాయకుడిగా, టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన నేతగా, సీఎం కేసీఆర్ పేరుపెట్టి పిలిచేంత చనువు ఉన్న ఉద్యమకారుడిగా వల్లకొండ సత్యనారాయణగౌడ్‌కు పేరుంది. 2004లో నిర్మల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేశారు. అప్పుడు కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలిచారు. అనంతరం సత్యనారాయణగౌడ్ టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన సతీమణి శోభారాణి ఉమ్మడి ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యారు. 2018 ఎన్నికల్లోనూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపుకోసం తీవ్రంగా శ్రమించారు. ఆ తర్వాత తన భార్యకు నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్‌గా చేసే అవకాశం వచ్చినా తిరస్కరించారు. తనకు ఎమ్మెల్సీ లేదా ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తుందని ఆశించారు. కానీ ఎలాంటి పదవి దక్కలేదు. మంత్రి నుంచి మద్దతు లేకనే పదవి దక్కలేదన్న భావనలో సత్యనారాయణగౌడ్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏడాదిగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడం లేదు.

'కూచాడి' మాటల దాడి...

బీఆర్‌ఎస్ ఊహించని పరిణామంగా ఇటీవల కూచాడి శ్రీహరిరావు మంత్రిపై చేసిన మాటల దాడి అని ఆ పార్టీ నాయకులే పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌లో పనిచేసినప్పుడు గురుశిష్యులుగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి, కూచాడి శ్రీహరిరావు ఆతర్వాత ప్రత్యర్థులుగా మారారు. 2009లో కాంగ్రెస్ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి, మహాకూటమిలో భాగంగా టీఆర్‌ఎస్ నుంచి శ్రీహరిరావు పోటీపడ్డారు. ఆ ఎన్నికల్లో వీరిద్దరూ కాకుండా ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలిచారు. ఆ తర్వాత 2014లో టీఆర్‌ఎస్ నుంచి శ్రీహరిరావు, బీఎస్పీ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి మరోసారి పోటీపడ్డారు. ఈ పోరులో అల్లోల గెలిచారు. ఆ తర్వాత ఆయన కూడా గులాబీ కండువా వేసుకుని మంత్రి అయ్యారు. ఒకే పార్టీలో ఉన్నా మొదట్లో అల్లోల, శ్రీహరిరావుల మధ్య విభేదాలు కొనసాగాయి. 2018 ఎన్నికలకు ముందు మంత్రి కేటీఆర్ చొరవ తీసుకుని రెండు వర్గాలనూ హైదరాబాద్ పిలిపించి మాట్లాడారు. ఆయన సూచన మేరకు శ్రీహరిరావు మళ్లీ మంత్రితో కలిసిపోయారు. గత ఎన్నికల్లో అల్లోల గెలుపులో కీలకంగా వ్యవహరించారు. ఎన్నికల తర్వాత మళ్లీ పాతకథే పునరావృతమైంది. ఉద్యమకారులకు, అసలైన నాయకులకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదంటూ శ్రీహరిరావు క్రమంగా దూరమవుతూ వచ్చారు. తాజాగా ఆత్మీయ సమ్మేళనాలు మరింత చిచ్చుపెట్టాయి. ఎవరూ ఊహించని విధంగా శ్రీహరిరావు ప్రెస్‌మీట్ పెట్టి మరీ మంత్రిపై మాటల దాడి చేశారు.

తెలంగాణ అభివృద్ధి దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, దండే విఠల్

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- స్వర్ణ గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎమ్మెల్సీలు దండే విఠల్, గంగాధర్‌గౌడ్

సారంగపూర్: తెలంగాణలో తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ముందుగా పార్టీ పతాకాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ లేవన్నారు. ప్రస్తుతం దేశమంతా తెలంగాణవైపు చూస్తోందని తులిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, అందుబాటులో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇలా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా పక్కా ప్రణాళికతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. ఆసరా, మిషన్ భగీరథ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయని వివరించారు. పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రజలు సైతం తెలంగాణ పథకాలు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇదంతా గిట్టని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవడానికి ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు.

అభివృద్ధి ప్రదాత కేసీఆర్..

రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది ఏళ్లలోనే అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. అభివృద్ధి ప్రదాతగా కేసీఆర్ నిలిచారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 12.50 లక్షల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, కేసీఆర్ కిట్ ద్వారా ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు పెంచామని వివరించారు. వెనుకబడిన తరగతుల పిల్లల చదువుల కోసం 325 గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు.

అభివృద్ధి చేతకాక విమర్శలు..

గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి పాలన సాగించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాక ఉద్యమనేత కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, అభివృద్ధి చేతకాక బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలను తెలంగాణ తరహాలో ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. అనంతరం పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ఆలూరు, కౌట్ల(బి) పీఏసీఎస్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి, నారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ యశోద, మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధ, సారంగాపూర్ సర్పంచ్ సుజాత, మండల నాయకులు పాల్గొన్నారు.

వీరహనుమాన్ శోభాయాత్ర



ఖానాపూర్: పట్టణంలోని వీరాంజనేయ శివసాయి సమాజ్ జంగల్ హన్మాన్ ఆలయం నుంచి ప్రధాన వీధులగుండా మంగళవారం శ్రీవీరహనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దల్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీలో భారీగా భక్తులు పాల్గొన్నారు. దారి పొడవునా డీజే పాటలకు యువకుల నృత్యం చేశారు. కూడళ్లలో యువకుల కర్రసాము, ఇతర విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సీఐ నారాయణనాయక్, ఎస్సై ఆర్ శంకర్ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, పెంబి జెడ్పీటీసీ జానుబాయి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, నాయకులు కాశవేని ప్రణయ్, అల్లాడి వెంకటేశ్వర్లు, రాచమల్ల రాజశేఖర్, చిన్నం సత్యం, పెరిక గంగాధర్, ప్రభాకర్, జితేందర్, పడాల రాజశేఖర్, సంతోష్, ఆకుల శ్రీనివాస్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' లబ్ధిదారుల ఎంపికకు లక్కీడ్రా



లక్కీడ్రాలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో రవికుమార్, అధికారులు

- అదనపు కలెక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో ప్రక్రియ
- 440 ఇళ్లకు పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక

భైంసాటౌన్: భైంసా పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మంగళవారం అధికారులు లక్కీడ్రా నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజర్వేషన్ ప్రాతిపదికన లబ్ధిదారులపేరిట చీటీలు వేసి డ్రా తీశారు. స్థానిక నిర్మల్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం నిర్వహించగా, డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు తరలివచ్చారు. దీంతో అధికారులు జాబితాలో పేరున్న వారిని మాత్రమే లోనికి అనుమతించారు. కాగా, లబ్ధిదారుల ఎంపిక సమయంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 440 ఇళ్లకుగాను 1,030 మంది పేర్లతో లక్కీడ్రా నిర్వహించగా, ఎంపికైనవారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించేలా వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. మరో 200 ఇళ్లలో ప్రస్తుతం గుండెగాం వాసులు ఆశ్రయం పొందుతున్నారని, ఇంకా 180 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఈ 380 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆందోళన చెందొద్దని సూచించారు. అర్హులైనవారికి విడతల వారీగా డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయిస్తానమి అదనపు కలెక్టర్ రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రవికుమార్, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా స్థలాలు మాకివ్వండి



రమాదేవితో మాట్లాడుతున్న తహసీల్దార్..

భైంసాటౌన్: భైంసా పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నిర్వహించిన లక్కీడ్రాలో గందరగోళం నెలకొంది. గతంలో పలువురికి ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. ఆ స్థలంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిరించారు. నిర్మాణ సమయంలో తమకు ఇళ్లు ఇస్తామని చెప్పారని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని స్థలం ఇచ్చినవారు ఆందోళన చేశారు. తమ స్థలా లు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ కు తరలించారు. అనంతరం స్థానిక ఐబీ వద్ద రా స్తారోకో చేపట్టగా, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి వారికి మద్దతుగా ధర్నాలో కూర్చున్నా రు. అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ సీఐ ఎల్.శ్రీను అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించే ప్ర యత్నం చేశారు. అయినా ఆందోళనకారులు పట్టించుకోలేదు. దీంతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడకు చేరుకుని, ప్రస్తుతం 440 మందికి మాత్రమే ఇళ్లు కేటాయించామని, మరో 380 ఇళ్లకు త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం రమాదేవి లబ్ధిదారుల దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు.

- జిల్లాకు చేరిన 6 వేల గిఫ్టులు
- ఇఫ్తార్ విందుల కోసం రూ.12 లక్షలు మంజూరు
- త్వరలో లబ్ధిదారులకు తోఫాల పంపిణీ

నియోజకవర్గాల వారీగా కేటాయించిన గిఫ్టులు, నిధులు

నిర్మల్	2000	4 లక్షలు
ముథోల్	2,500	5 లక్షలు
ఖానాపూర్	1,500	3 లక్షలు

రంజాన్ కానుకలొచ్చాయ్



నిర్మల్ తహసీల్దార్ కార్యాలయంలో కానుకలు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యమిస్తున్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం పేద ముస్లింలకు ఏటా రంజాన్ కానుకలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది కూడా రంజాన్ గిఫ్టు(తోఫా)లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. విందుల కోసం నిధులు అందిస్తోంది. ఈ నెల 22న రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 6 వేల మందికి రంజాన్ గిఫ్టులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలోని ఆయా గోదాంలకు కానుకలు చేరుకున్నాయి.

మూడు నియోజకవర్గాలు 6 వేల గిఫ్టులు..

జిల్లా వ్యాప్తంగా నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలోని 18 మండలాల్లోని ముస్లింలకు 6 వేల గిఫ్టులు అందించనున్నారు. నిర్మల్ నియోజకవర్గానికి 2 వేలు, ముథోల్ నియోజకవర్గానికి 2500, ఖానాపూర్ నియోజకవర్గానికి 1500 చొప్పున పంపిణీ చేయనున్నారు. ప్రతీ గిఫ్ట్‌లో ఒక చీర, ఒక జాకెట్, ఒక పంజాబ్ డ్రెస్ మెటీరియల్, లాల్చీ, పైజామా ఉంటుంది. ఆయా మండలాల మసీదు కమిటీల ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసి కానుకలు పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని కమిటీలు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కానుకలు అందించనున్నారు.

ఇఫ్తార్‌కు రూ.12 లక్షలు..

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు రోజా(ఉపవాసం) తర్వాత ఒక్క పొద్దు విడుస్తారు. వారికి ఇఫ్తార్ విందు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తుంది. జిల్లావ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో నియోజకవర్గస్థాయి ఇఫ్తార్ విందుల కోసం ప్రభుత్వం రూ.12 లక్షలు విడుదల చేసింది. ఇందులో నిర్మల్ నియోజకవర్గానికి రూ.4 లక్షలు, ఖానాపూర్ కు రూ.3 లక్షలు, ముథోల్‌కు రూ.5 లక్షలు కేటాయించింది. ఆయా నియోజవర్గాల్లోని సంబంధిత కమిటీల బ్యాంకు ఖాతాలో ఈ నిధులు జమ చేయనున్నారు.

పంపిణీకి ఏర్పాట్లు



నిర్మల్ నియోజకవర్గానికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే నిర్మల్ నియోజకవర్గానికి సంబంధించి 2 వేల గిఫ్ట్ ప్యాక్‌లు వచ్చాయి. అర్హులైను గుర్తించి కానుకలు అందిస్తాం. స్థానిక మంత్రితో చర్చించి గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీకి తేదీలు ప్రకటిస్తాం.

– సుభాష్ చందర్, నిర్మల్ అర్బన్ తహసీల్దార్

పేపర్ లీకేజీలు పునరావృతం కావొద్దు

- 'పది' పరీక్షలు సజావుగా సాగేలా చూడాలి
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్తే కఠిన చర్యలు
- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు పునరావృతం కావొద్దని, పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరుసగా రెండు రోజులు పదో తరగతి ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకరిద్దరి తప్పిదంతో పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పరీక్ష ప్రారంభించిన తర్వాత ప్రశ్నపత్రం బయటకు రావడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సిబ్బందితోపాటు తనిఖీలకు వెళ్లే కలెక్టర్లు, డీఈవోలు, తహసీల్దార్లు కూడా సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దన్నారు. ప్రశ్న, జవాబు పత్రాల రవాణా సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిగతా నాలుగు పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈవో రవీందర్‌రెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం వద్దు..

విద్యాశాఖ అధికారులు ప్రశ్నపత్రాల విషయంలో అలసత్వం వహించొద్దని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి విద్యాశాఖ, పోస్టల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పదో తరగతి పరీక్షలు మరింత కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణా సమయంలో జాగ్రత్త వహించాలని పోస్టల్ అధికారులకు సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

పటిష్ట బందోబస్తు...

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పోలీసు శాఖ తరఫున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దీనికోసం అదనంగా పోలీస్ సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు.


'ఆరోగ్య మహిళ' సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: మహిళల కోసం ప్రత్యేకంగా చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. స్థానిక బంగల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ప్రతీ మంగళవారం మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేంద్రాల్లో మహిళలకు 8 రకాల సమస్యల కోసం 57 రకాల పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. తద్వారా రోగాన్ని గుర్తించి సత్వరమే చికిత్స అందించే వీలుంటుందని వెల్లడించారు. ప్రతీవారం వంద మంది మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో ధనరాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్, వైద్యసిబ్బంది ఉన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కరించాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంగళవారం కలిసి ఈమేరకు విన్నవించారు. గుండెగాం పునరావాసం, కాళేశ్వరం 28 ప్యాకేజీ పనుల ప్రారంభం, గడ్డెన్నవాగు ప్రాజెక్టు కెనాల్ పెండింగ్ పనులు, నూతన జీపీ భవనాలు తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి, చర్యలకు అధికారులను ఆదేశించినట్లు విఠల్‌రెడ్డి తెలిపారు.

కేజీబీవీలో ఎంసెట్ కోచింగ్



ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో చదివేది పేద విద్యార్థినిలే. బాలికల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో ఉచితంగా ఎంసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థినిలు ఇంటిబాట పట్టారు. ఖాళీగా ఉండకుండా జూమ్ యాప్ ద్వారా వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులను బోధిస్తున్నారు. గతంలో కూడా కేజీబీవీల్లో చదివిన విద్యార్థినులు ఇంజనీరింగ్, నర్సింగ్ తదితర కోర్సుల్లో సీట్లు సాధించారు. లక్షల రూపాయలు వెచ్చించి శిక్షణ పొందలేని విద్యార్థినులకు ఈ శిక్షణ వరంగా మారనుంది.


కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు (ఫైల్)

- జూమ్ ద్వారా ప్రత్యేక శిక్షణ
- బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కసరత్తు
- గతేడాది పలువురికి ఎంసెట్, నర్సింగ్ సీట్లు

జిల్లా	ఇంటర్ కేజీబీవీలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	09	161
నిర్మల్	06	94
మంచిర్యాల	05	87
ఆసిఫాబాద్	06	77

జూమ్ యాప్ ద్వారా ప్రత్యేక శిక్షణ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 26 ఇంటర్మీడియేట్ కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యాబోధన చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 161 మంది విద్యార్థినిలు ఎంసెట్ పరీక్ష రాయనుండగా 14 మంది విద్యార్థినిలు బీఎస్సీ నర్సింగ్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. హాజరు శాతం మాత్రం తక్కువగా ఉంది. 50 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరవుతున్నారు. నిర్మల్‌లో 94 మంది ఎంసెట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోగా హాజరుశాతం మెరుగ్గానే ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్‌లో 77మంది నమోదు చేసుకోగా 50మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు. మంచిర్యాల జిల్లాలో 87 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 60మంది వరకు తరగతులను వీక్షిస్తున్నారు. వీరికి ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8గంటల వరకు జూమ్ యాప్‌లో తరగతులు బోధిస్తున్నారు. సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు సందేహాలను నివృత్తి చేసేందుకు కేజీ బీవీ పీజీ సీఆర్టీలను ప్రత్యేకంగా నియమించారు. స ందేహాల నివృత్తికి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు.

35 రోజుల పాటు శిక్షణ..

ఎంసెట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినిలకు 35 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. రోజుకు సబ్జెక్టుకు సంబంధించి 40చొప్పున బిట్స్ చెబుతున్నారు. వీటిలో 20బిట్స్ బోధిస్తుండగా, 20 బిట్లను ప్రాక్టిస్ కోసం వాట్సాప్ గ్రూప్‌లో పంపుతున్నారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక ఐడి కేటాయి ంచారు. కొన్ని సాంకేతిక కారణాలతో విద్యార్థులు శిక్షణకు హాజరు కాలేకపోతుండగా మరికొంతమంది విద్యార్థినిలు స్మార్ట్ ఫోన్‌లు లేక శిక్షణకు దూరమవుతున్నారు. గతేడాది నేరడిగొండ కేజీబీవీకి చెందిన ముగ్గురు విద్యార్థినిలు బీఎస్సీ నర్సింగ్ సీట్లు సాధించారు. బోథ్‌కు చెందిన ఓ విద్యార్థిని హైదరాబాద్‌లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించింది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం కల్పిస్తున్న ఎంసెట్ శిక్షణ తరగతులను కేజీబీవీ విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలి. ఆదిలాబాద్ జిల్లాలో 161 మంది విద్యార్థినిలు ఎంసెట్ కోసం, 14మంది విద్యార్థినిలు బీఎస్సీ నర్సింగ్ శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి జూమ్ యాప్ ద్వారా తరగతులు బోధించడం జరుగుతుంది. విద్యార్థినుల హాజరు తక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణ తరగతులకు హాజరయ్యేలా చూడాలి. ఏమైన సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు పీజీ సీఆర్టీలను నియమించాం.

– ఉదయశ్రీ, కేజీబీవీ సెక్టోరల్ అధికారి

గంటలో 3.54లక్షల మొక్కలు.. లిమ్కాబుక్‌లో చోటు

- ఎమ్మెల్యే రామన్నకు ప్రశంసా పత్రం అందజేసిన సీఎం కేసీఆర్


ఎమ్మెల్యేకు ధృవపత్రం అందిస్తున్న సీఎం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పుట్టిన రోజును పురస్కరించుకుని 2021 జూలై 4న స్థానిక దుర్గానగర్‌లో మొక్కలు నాటిన కార్యక్రమానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త, రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు చోటు లభించింది. గంటలో అత్యధిక మొక్కలు నాటించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు చోటు కల్పించినట్లు లిమ్కాబుక్ రికార్డ్స్ ఎడిటర్ వత్సాల కౌల్ బెనర్జీ తెలిపారు. లిమ్కా బుక్ ప్రశంస పత్రాన్ని సీఎం కేసీఆర్ సంతోష్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం ప్రగతిభవన్‌లో అందుకున్నారు. గ్రీన్‌ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా సంతోష్ కుమార్ చొరవతో ఒక గంట వ్యవధిలో 16,900 వందల మంది భాగస్వామ్యంతో 3,54,900 మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి సంజీవ రాఘవ, బీఆర్ఎస్ యువ నాయకులు జోగు మహేందర్, స్వాస్ సంస్థ అధ్యక్షులు కారింగుల ప్రణయ్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పలువురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. 22 మంది పట్టుబడగా వారిని కోర్టులో హాజరు పరిచారు. వారికి రూ.25100 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

క్లుప్తంగా

108లో ప్రసవం


108లో ప్రసవించిన సుబ్బమ్మ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన సుబ్బమ్మ తొమ్మిది నెలల గర్భవతి. మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. బైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ పూజారి లక్ష్మణ్, పైలెట్ ఖాజామోయినోద్దీలు ప్రసవం చేశారు. 108లో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది పేర్కొన్నారు..

బజార్‌హత్నూర్: మండలంలోని మహదేవ్ నగర్‌కు చెందిన కోమలబాయికి మంగళవారం ఉదయం పురుటినొప్పులొచ్చాయి. స్థానికులు 108 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారమిచ్చారు. దీంతో బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ గోపీ, పైలట్ శ్రీనివాస్ ఫోన్‌లో ఈఆర్‌సీపీ డాక్టర్ మహిత్ ఆన్‌కాల్ ద్వారా సలహాలు తీసుకుని ప్రసవం చేశారు. దీంతో మగబిడ్డను ప్రసవించింది. తల్లి, బిడ్డను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఆవు, లేగదూడను తరలిస్తున్న ట్రాలీ పట్టివేత


పోలీసులు పట్టుకున్న ట్రాలీఆటో

తాంసి: జిల్లా కేంద్రంలోని గోవధశాలకు అక్రమంగా ఆవు, లేగదూడను తరలిస్తున్న ఆటో ట్రాలీని పట్టుకున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం ... మండలంలోని సుంకిడి గ్రామం నుంచి జిల్లా కేంద్రంలోని గోవధశాలకు ఆవు, లేగదూడను ఆటోట్రాలీలో తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఆవు లేగదూడను తరలిస్తున్న ట్రాలీని ఎస్సై పొన్నారి గ్రామం వద్ద పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న షేక్ కలీం, షేక్ ఉబాయిద్‌లు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

భైంసాటౌన్: తానూర్ మండలం మహాలింగి గ్రామానికి చెందిన కాప్రె గంగాధర్(32) ఈ నెల ఒకటో తేదీన అదృశ్యమయ్యాడు. మంగళవారం భైంసాలో మృతిచెంది కనిపించాడు. భోకర్ రోడ్డులోని నర్సరీ వెనుక కుళ్లినస్థితిలో మృతదేహం కనిపించడంతో సమాచారమందుకున్న పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతదేహం సమీపంలో పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్యగా భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ప్రాణం తీసిన అదనపు కట్నం

- పురుగులమందు తాగిన బాలింత
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- గత నెల 6వ తేదీన మగబిడ్డ జననం
- ఆస్పత్రి ఎదుట కుటుంబీకుల నిరసన
- అత్తింటివారిని అరెస్ట్ చేయాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు


ఐశ్వర్య (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: నవమాసాలు మోసి మగబిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి వరకట్న వేధింపులకు బలైంది. దీంతో కుటుంబీకులు రిమ్స్ ఆవరణలో ఆందోళనకు దిగారు. మృతురాలి భర్తతో పాటు అత్తింటి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రిమ్స్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబీకుల వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం సుంగాపూర్‌కు చెందిన ఐశ్వర్య (20) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న బండారి మహేష్‌తో 2022 ఫిబ్రవరి 3న వివాహం చేశారు. మహేష్ ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడ 32వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వివాహ సమయంలో రూ.22 లక్షల కట్నం ఒప్పుకున్నారు. పెళ్లి సమయానికి రూ.10 లక్షలు ఇచ్చారు. ఐశ్వర్య గర్భం దాల్చిన తర్వాత ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. గత నెల 6వ తేదీన మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి రూ.22లక్షల కట్నం తీసుకుని రావాలని నిత్యం ఫోన్‌లో వేధింపులకు గురిచేసేవాడు. గతంలోనూ ఈ విషయమై ఐశ్వర్య తల్లిదండ్రులు మహేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయినా వేధింపులు ఆగలేదు. మనస్తాపానికి గురైన ఐశ్వర్య సోమవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. దీంతో కుటుంబీకులు మహేశ్‌ను అరెస్టు చేసి ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని ఆందోళనకు దిగారు. పోలీసులు సముదాయించేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. దీంతో పోలీసులు ఆందోళనకారుల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం టూటౌన్ సీఐ పురుషోత్తం చేరుకుని భరోసా కల్పించడంతో ఆందోళన విరమించారు.

గోదారంగనాథుల కల్యాణం




కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదాదేవిరంగనాథుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తులు వేంకటేశ్వరస్వామి శోభాయాత్రను నిర్వహించారు. అలాగే ఆలయంలోని ఉత్సవ విగ్రహాలతో ఎదుర్కోలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ నెల 6వ తేదీన రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. టీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీహరిరావు, పీఏసీఎస్ చైర్మన్ హరీష్‌కుమార్ పూజలు చేశారు.

బంధుత్వాలు తెలిపే 'బలగం'


తలమడుగులో బలగం సినిమాను తిలకిస్తున్న గ్రామస్తులు


బోథ్‌లో..


నేరడిగొండ: తేజాపూర్‌లో చిత్ర ప్రదర్శన

తలమడుగు: తలమడుగు మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు గత అనుభవాలను గుర్తు చేసే మనుషులను తట్టి లేపే సినిమా బలగం అన్నారు. అలాంటి సినిమాను ప్రజలందరూ తిలకించాలని ఉద్దేశంతో గ్రామంలో ప్రదర్శించినట్లు వివరించారు. పలువురు సినిమా చూసి తమ ఆత్మీయులను తలుచుకుని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. మరిచిపోతున్న బంధాలను గుర్తుచేసే విధంగా తమకు మంచి సినిమా చూపెట్టిన దశరథ్‌ను గ్రామస్తులు అభినందించారు.

బోథ్, కౌఠలో..

బోథ్: బోథ్ మండల కేంద్రంలో హనుమాన్ కాలనీలో బలగం సినిమా ప్రదర్శన సోమవారం రాత్రి ఏర్పాటు చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో సినిమాను తిలకించారు. బంధుత్వం, ప్రేమ, కుటుంబసభ్యుల మధ్య ఆప్యాయతతో కూడిన సినిమా బలగమని సర్పంచ్ సురేందర్, విడిసి అధ్యక్షుడు గంగాధర్ పేర్కొన్నారు. అలాగే కౌఠ గ్రామంలో మంగళవారం ప్రదర్శించారు. సినిమా చూసిన అనంతరం పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

తేజాపూర్‌లో...

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శన చేపట్టారు. దీంతో గ్రామస్తులందరు చిత్ర ప్రదర్శనను తిలకించారు. తెలంగాణ పల్లెలో కుటుంబాలు ఏవిధంగా ఉండాలో కళ్లకు కట్టినట్లుగా చూపెట్టడంతో అందరు ఆసక్తిగా తిలకించారు. ఈ సినిమా లాగే కుటుంబ బాంధవ్యాలు ఉండాలని చర్చించుకున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లోని పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడిన ఇరువురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన అబుహాజీ ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. గత జనవరి నెలలో స్థానిక ఆజాద్‌కాలనీలోని ఓ ఇంట్లో, ఫిబ్రవరిలో అదే కాలనీలోని మరో ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. మరో నేరస్తుడైన మహ్మద్ అస్లామ్‌బిన్ సైతం అదే కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. వీరు జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఎస్సై రమణారావుకు పట్టుబడ్డారు. అయితే అబుహాజీపై డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బాలికను ఎత్తుకెళ్లగా కేసు నమోదైంది. ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి గాయాలు


గాయాల పాలైన పట్వారి సీతారాం


రాథోడ్ లచ్చిరాం నాయక్ (ఫైల్)

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకు ంది. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన రాథోడ్ లచ్చి రాంనాయక్ (57) నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన పట్వారి సీతారాంతో కలిసి స్కూటీపై ఇచ్చోడకు వెళ్లి తిరిగి వస్తుండగా కుప్టి వంతెనపై గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లచ్చి రాం నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పట్వారి సీతారాం కాలు విరిగింది. లచ్చిరాం నాయక్ నేరడిగొండ లంబాడీ నాయక్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా గాయాల పాలైన సీతారాంను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల కార్యవర్గం ఎన్నిక


బాబాగౌడ్ దుర్గం శేఖర్ మల్లేశ్

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని దుర్గం సొసైటీ కార్యాలయంలో సమావేశమైన నాలుగు జిల్లాల పరిధిలోని కాంట్రాక్టర్లు తమ సమస్యలపై చర్చించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గురునాథం బాబాగౌడ్, అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల భాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా భూపెల్లి మల్లేష్, ముఖ్య సలహాదారుగా రత్నం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా మహావీర్, రుక్మారెడ్డి, సునీల్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా మురళి, కోశాధికారిగా ఎన్. దేవరాజ్, కార్యవర్గ సభ్యులుగా తోట పాపేష్, ఏ.రజిత బి. దేవేందర్ డి.శ్యాం కుమార్‌ను ఎన్నుకున్నట్లుగా జిల్లా అధ్యక్షుడు శేఖర్ తెలిపారు.

భానుడి భగభగ


స్కూటీపై ఇలా..


మధ్యాహ్నం నిర్మానుష్యంగా రిమ్స్ ఎదుట రోడ్డు


మాస్కు ధరించి చిన్నారిని తీసుకెళ్తున్న తల్లి

మార్చి మొదటి వారంలోనే ఎండల తీవ్రత భగ్గుమంటోంది. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం 11 గంటలైతే చాలు జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు, పాఠశాలల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థులు స్కార్ఫ్‌లు, దుప్పట్లు, గొడుగుల సాయంతో వెళ్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సారు.... ఇదేం తీరు!



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కింది స్థాయి ఉద్యోగులతో అధికారులు వారి సొంత పనులు చేయించుకుంటున్నారు. మంగళవారం బల్దియాలో ఇటీవల ఓ అధికారి కారును కొనుగోలు చేయగా దానిని బల్దియా ఉద్యోగి కడిగి శుభ్రం చేశాడు. బల్దియాకు వచ్చిన పట్టణవాసులు దానిని చూసి పెదవి విరిచారు.